ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
గురువారం 7 మార్చి 2024



అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 6: ములుగు జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ములుగులో బుధవారం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కూడా కృషి చేయాలన్నారు. జీతం కోసమే అన్నట్టు కాకుండా ప్రజల కోసం పనిచేస్తే కలకాలం గుర్తుండిపోతారని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలంటే అధికారులందరూ ఒక జట్టుగా ఏర్పడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శాశ్వత అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసి వాటి ద్వారా స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి కల్పించేవిధంగా నూతన విధానాలను ఏర్పాటు చేసేదిశగా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. అధికారుల తీరు గ్రామాలకు వన్నెతెచ్చేలా ఉండాలని, అటవీ అధికారులు అడవుల వల్ల ప్రజలకు ఎలాంటి లాభాలు చేకూరుతాయో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకునేందుకు జిల్లా అధికారులు తప్పకుండా ఫీల్డ్ వర్క్ నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న పనులనిటినీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో సీసీరోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. డీఆర్‌డీవో ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించాలని, స్వయం సహాయక మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో ధరణి మార్గదర్శకాల ప్రకారం భూ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించాలన్నారు. 40 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మేడారం స్థూపం ప్రాంతంలో నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. అదేవిధంగా ఐటీడీఏలో అధికారులు ఎల్లప్పుడూ గిరిజనులకు అందుబాటులో ఉండాలని, నూతన ఐటీడీఏ భవనం కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఏఎన్‌ఎంలు, జూనియర్ లెక్చరర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించేలా కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, అటవీ శాఖ జిల్లా అధికారి కిషన్‌జాదవ్, ములుగు, మహబూబాబాద్ అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్‌జీ, లెనిన్ వాత్సల్ టొప్పో, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, ములుగు, భూపాలపల్లి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడికి పరామర్శ

వెంకటాపూర్(రామప్ప): ఇటీవల తల్లిని కోల్పోయిన మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడిశెట్టిని మంత్రి ధనసరి సీతక్క పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, నాయకులు బానోత్ రవిచందర్, చాంద్‌పాషా, బండి శ్రీను, జంగిలి రవి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, సాంబయ్య, నల్ల కోటి, జాకీర్, చేరాలు, రాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

వివరాలు 6వ పేజీలో...

- కుంగిన తర్వాత రెండోసారి డ్యామ్‌సేఫ్టీ అథారిటీ బృందం రాక
- ఉదయం మేడిగడ్డ, మధ్యాహ్నం అన్నారం బ్యారేజీల పరిశీలన
- ప్రాజెక్టు లోపాలు, పునరుద్ధరణ అవకాశాలపై అధ్యయనం
- కీలకం కానున్న సిఫారసులు



మరోమారు..

భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) బృందం మరోసారి సందర్శించనుంది. ఈ ప్రాజెక్టులోని పలు పిల్లర్లు కుంగిన తర్వాత రెండోసారి ఇక్కడకు వస్తున్న బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లోపాలు మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఉదయం భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్, మధ్యాహ్నం అన్నారం సరస్వతి బ్యారేజీలను జాతీయ ఆనకట్టల భద్రత విభాగం నిపుణులు పరిశీలించనున్నారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడోబ్లాకులో పిల్లర్ నెంబర్ 19, 20, 21 కుంగిన విషయం తెలిసిందే. దీంతో మేడిగడ్డ బ్యారేజ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై రాజకీయంగా ప్రస్తుతం పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసి సిఫారసులు చేయాలని కోరడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం ఒక దఫా ప్రాజెక్టును సందర్శించి వెళ్లింది. ఈ పరిణామాల క్రమంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం రాజకీయ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇటీవలే అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షమైన బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాలు చేపట్టి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలకు ప్రాజెక్టును అస్త్రంగా వాడుకుంటోందం టూ బీఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగడంతో ప్రభుత్వం వీలైనంత తొందరగా ఈ రెండు ప్రాజెక్టుల భవితవ్యాన్ని తేల్చాలంటూ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాయడంతో ప్రస్తుతం నిపుణుల కమిటీ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది...

బృందం పర్యటన సాగనుందిలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీలను అధ్యయనం చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం గురువారం రోజంతా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను సుదీర్ఘంగా అధ్యయనం చేయనుంది. ఉదయం 9గంటలకు ఎన్‌డీఎస్‌ఏ బృందం మేడిగడ్డ చేరుకొని అల్పాహారం తర్వాత 9.30 గంటలకు బ్యారేజీ తనిఖీల ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు దెబ్బతిన్న పిల్లర్లు, డిజైన్ల లోపాలు, నిర్మాణ నాణ్యత, మరమ్మతులకు గల అవకాశాలు లాంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది. మధ్యాహ్నం ఒకటిన్నరకు మేడిగడ్డ వద్ద భోజనం ముగించుకుని రెండున్నర గంటలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ వద్దకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 3.15 నుండి సాయంత్రం ఆరున్నర గంటల వరకు సరస్వతి బ్యారేజ్‌ని పరిశీలించి నేరుగా రామగుండం వెళుతుంది. ఆ మరుసటి రోజు సుందిళ్ల బ్యారేజ్‌ని తనిఖీ చేయనున్నారు.

నిపుణుల కమిటీ సిఫారసులే కీలకం

దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీల భవితవ్యాన్ని ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల బృందం ఇచ్చే నివేదికలే తేల్చనున్నాయి. నిపుణుల కమిటీ ప్రధానంగా 19 అంశాలపై సమాచారం అడిగినందున తనిఖీలలో వాటి పైనే ప్రధానంగా ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు డిజైన్ మొదలు క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దెబ్బతిన్న ఏడో బ్లాకులోని పిల్లర్ల మరమ్మతులకు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయి? మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుంది? దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మించాలా? వద్దా? అనే అంశాలను నిపుణులు తేల్చే అవకాశాలున్నాయి.

నేడు మేడిగడ్డకు ఎన్‌డీఎస్‌ఏ బృందం

ఎప్పుడేం జరిగిందంటే..

గతేడాది అక్టోబర్ 21న బ్యారేజీలోని బ్లాక్-7లో పెద్ద పెద్ద శబ్దాలతో 20వ పిల్లర్ అడుగుమేర కుంగిపోయింది. దీంతో బ్యారేజీ పైనుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆ మరుసటిరోజైన 22న ప్రతిపక్ష ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బ్యారేజీ, కుంగిన ప్రాంతాన్ని సందర్శించారు. 24న కేంద్ర జలశక్తి శాఖ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అనిల్ జైన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం పరిశీలన. 25న 200మంది రైతులతో పొన్నం ప్రభాకర్ బ్యారేజీ సందర్శించారు. నవంబర్ 2న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించి నాటి ప్రభుత్వ వైఫల్యాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అలాగే నవంబరు 4న కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి కూడా మేడిగడ్డకు చేరుకుని కుంగిన వంతెనను పరిశీలించారు. ఆ తర్వాత 6వతేదీన కోదండరాం పరిశీలించారు. ఇక కాంగ్రెస్ అధికారం చేపట్టాక డిసెంబరు 29న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తదితరులు బ్యారేజీని సందర్శించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇక ఈ ఏడాది జనవరి 9న విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఆధ్వర్యంలో మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్ హౌజ్, మహాదేవపూర్ లోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయి. ఆ తర్వాత ఫిబ్రవరి 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రివర్గ సభ్యుల ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ పర్యటించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి గత ప్రభుత్వం కాళేశ్వరాన్ని పనికిరాకుండా చేసిందని ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. దానికి దీటుగా మార్చి 1న బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించి.. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి తమపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టే ప్రయత్నం చేసింది.

రామప్పకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ములుగు కలెక్టరేట్, మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా వెంకటాపూర్(రామప్ప) మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ఈనెల 8 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ బస్టాండ్ నుంచి రామప్పకు ప్రతి అర గంటకు ఒక బస్సు, ములుగు నుంచి రామప్పకు ప్రతి 15నిమిషాలకు ఒక బస్సు నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి రామప్పకు బస్సుచార్జి(ఎక్స్‌ప్రెస్) పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, పల్లెవెలుగు పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.40, ములుగు నుంచి రామప్పకు(ఎక్స్‌ప్రెస్) పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.30, పల్లెవెలుగు పెద్దలకు రూ.30, పిల్లలకు 20గా నిర్ణయించినట్లు వివరించారు.

స్పైసెస్ బోర్డు ఏడీ పర్యటన



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న స్పైసెస్ బోర్డు ఏడీ విజ్ఞిష్ణ

ఏటూరునాగారం, మార్చి 6 : స్పైసెస్ బోర్డు ఏడీ విజ్ఞిష్ణ మండల కేంద్రంలో బుధవారం పర్యటించారు. జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డితో కలిసి ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నను కలిశారు. ఈ నెల 12న కళాశాలలో కామర్స్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ, జాతీయ సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మేరా యువభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150 మందికి పైగా విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని నిర్ణయించామన్నారు. మేరా యువభారత్ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్ర సూక్ష్మ, లఘు పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొని కేంద్ర భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక పథకాలు సుగంధ పంటల ఉత్పత్తుల ఎగుమతులు ప్రోత్సాహకాలను విద్యార్థులకు వివరించి పారిశ్రామిక విధానంపై అవగాహన నైపుణ్య అభివృద్ధి కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికి కేంద్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



రైతునేస్తం కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, ప్రజాప్రతినిధులు

కాటారం, మార్చి 6: వ్యవసాయ ఆధునిక సాంకేతిక విధానాలపై మండల కేంద్రంలోని కాటారం క్లస్టర్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా నిర్వహించగా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులతో కలిసి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం 110అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రైతు వేదికల్లో తొలివిడతగా డిజిటల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసిందన్నారు. మిగతా 2వేలకు పైగా రైతు వేదికల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు తోడ్పాటునందిస్తోందన్నారు. రైతులు ఈ సాంకేతికను అందిపుచ్చుకుని మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, ఏడీఏ శ్రీనివాసరాజు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, మహాముత్తారం జడ్పీటీసీ శారద, ఎంపీటీసీలు జాడి మహేశ్వరి, విజయారెడ్డి, కాటారం, మహముత్తారం, మల్హర్, మహదేవపూర్, పలిమెల ఏవోలు రామకృష్ణ, సతీష్, సుధాకర్, ప్రభావతి, మహేష్, పలువురు ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హై డ్రామా!

- మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అరెస్టుకు యత్నం
- కొత్త హరిబాబు సహా ఏడుగురిపై గతంలో భూఆక్రమణ కేసు నమోదు
- అదుపులోకి తీసుకొనేందుకు వచ్చిన పోలీసులు
- లోపలి నుంచి తలుపులు బిగించుకున్న హరిబాబు
- ఆపై కళ్లుగప్పి అజ్ఞాతంలోకి..
- అధికార పార్టీ కుట్ర చేస్తోందంటూ వీడియో విడుదల



పోలీసుల కళ్లుగప్పి బైక్‌పై వెళ్లిపోతున్న హరిబాబు

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి), మార్చి 6: భూ ఆక్రమణ కేసులో అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులకు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు చుక్కలు చూపించారు. ఇంట్లోకి వారు రాకుండా తలుపు బిగించుకున్నారు. కాస్తంత పక్కకు పోలీసులు వెళ్లిపోగా వారి కళ్లుగప్పి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. భూపాలపల్లిలో బుధవారం ఏడు గంటల పాటు జరిగిన ఈ నాటకీయ పరిణామం తీవ్ర ఉత్కంఠ రేపింది.

బీఆర్‌ఎస్‌కు చెందిన ఆయన భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్ నగర్‌లోని చెరువును ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టారని రామలింగమూర్తి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కొంతకాలంగా హరిబాబు అందుబాటులో లేకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. గురువారం కొత్తగా మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో హరిబాబు రెడ్డికాలనీలోని తన ఇంటికి చేరుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడానికి బుధవారం తెల్లవారుజామునే అక్కడికి చేరుకున్నారు. సీఐ నరేష్‌కుమార్, ఎస్సై శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు హరిబాబును అరెస్టు చేయడానికి యత్నించారు. అయితే పోలీసుల రాకను గమనించిన ఆయన లోపలి నుంచి తలుపులు బిగించుకొని అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే హరిబాబు ఓ వీడియోను విడుదల చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో కోరం లేకుండా చేయడానికే తనపై తప్పుడు కేసులు బనాయించి అధికార పార్టీ నేతలు పోలీసులతో అరెస్టు చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

హరిబాబు విడుదల చేసిన వీడియోను సోషల్ మీడియాలో వీక్షించిన ఆయన అనుచరులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పొచ్చని భావించిన పోలీసులు కాస్త వెనక్కితగ్గారు. ఉన్నట్టుండి అక్కడి నుంచి పక్కకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన హరిబాబు పోలీసుల కన్నుగప్పి తన అనుచరుడి బైక్‌పై వెనుక కూర్చొని భూపాలపల్లి నుంచి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏడు గంటలపాటు జరిగిన ఈ నాటకీయ పరిణామం సర్వత్రా చర్చకు దారి తీసింది.



కొత్త హరిబాబును అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళా కార్యకర్తలు

కేసు కథా కమామీషు ఇలా..

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంజూర్‌నగర్ ప్రాంతంలో నీటిపారుదల శాఖకు చెందిన చెరువును ఆక్రమించి అందులో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్థలంలో తొలుత జిల్లా మినరల్ ఫండ్ నిధులతో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించగా, దానికి అనుబంధంగా ఆలయ నిర్వాహణ పేరుతో కాంప్లెక్స్‌ను కట్టి అద్దెకు ఇవ్వడం విమర్శలకు దారితీసింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి (ఏ-1), ఆయన సతీమణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి (ఏ-2), కుమారుడు గౌతం రెడ్డి (ఏ-3), మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి (ఏ-4), ఆమె భర్త సెగ్గం సిద్ధు (ఏ-5), వైస్ చైర్మన్ కొత్త హరిబాబు (ఏ-6), కార్పొరేటర్ గండ్ర హరీశ్‌రెడ్డి (ఏ-7)పై కేసు నమోదైంది. గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి

మిగతా 6వ పేజీలో...

ఇద్దరిపై హత్యాయత్నం

మద్యం షాపు వద్ద బీర్ సీసాలతో దాడి

ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కాటారం, మార్చి 6: మద్యం షాపు వద్ద ఇద్దరు వ్యక్తులపై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బీర్ సీసాలతో పొడిచి హత్యాయత్నం చేశారు. భూపాలపల్లి కాటారం మండలం రేగులగూడెంలో ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకోగా బుధవారం వెలుగుచూసింది. దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం..

మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని గంగారం క్రాస్ రోడ్డు సమీపంలోని వైన్‌షాపు వద్ద పర్మిటట్‌రూంలో మద్యం తాగడానికి శంకరంపల్లి గ్రామానికి చెందిన జంగా భీమరాజు, టేక సంతోష్, కాటారం గ్రామానికి చెందిన జాడి బాలరాజు వెళ్లారు. అదే సమయంలో మల్హర్ మండలం కొండంపేట గ్రామానికి చెందిన కోలకాని సమ్మయ్య, శాత్రాజ్‌పల్లికి చెందిన ముంజం కరుణాకర్‌తోపాటు మరి కొందరు మిత్రులు మద్యం కోసం పర్మిట్‌రూంలోకి వెళ్లారు. పక్కపక్కనే టేబుళ్ల వద్ద రెండు గ్రూపులుగా మద్యం సేవించారు. ఇదే క్రమంలో స్టఫ్ విషయమై భీమరాజు, సమ్మయ్యకు గొడవ మొదలైంది. మాటామాట పెరిగి వివా దం పెద్దదవుతున్న క్రమంలో పక్కనున్న వారు సర్దిచెప్పగా కొద్దిసేపు మిన్నకుండిపోయారు. ఆ తర్వాత మరోసారి మద్యం తాగగా మత్తు ఎక్కువై మరోసారి ఘర్షణ చోటుచే సుకుంది. ఈ క్రమంలో భీమరాజు, సంతోష్, బాలరాజు బీరుసీసాలు పగులగొట్టి సమ్మయ్య, కరుణాకర్‌పై దాడి చేశారు. పలు చోట్ల పొడవడంతో ఇద్దరికీ తీవ్రగా యాలయయ్యాయి. సంఘటన అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. క్షతగాత్రులను వెంటనే తోటి స్నేహితులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. కోలకాని సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ఎస్సై-2 సురేష్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు లక్ష్మీరాజు, వేణు గాలింపు చర్యలు చేపట్టారు. కాటారం-మంథని రోడ్డు పక్క న గల వెంచర్‌లో ముగ్గురు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం అక్కడికి చేరుకొని వారిని అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.




క్షతగాత్రులు కరుణాకర్, సమ్మయ్య

మేడారం ఆదాయం రూ.13.25కోట్లు

పూర్తయిన అన్నికానుకల లెక్కింపు.. ఏడు రోజుల కౌంటింగ్‌కు తెర

హనుమకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ద్వారా ఈ సారి మొత్తం రూ.13,25,22,511 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవో రాజేంద్రం తెలిపారు. హుండీల లెక్కింపు మంగళవారమే పూర్తికాగా బుధవారం పసుపు, కుంకుమ, బెల్లంతో తడిసి ముద్దయిన నోట్లు, నాణాలను లెక్కించగా రూ.53,43,231గా తేలింది. ముద్దయిన నోట్లను సబ్బు నీళ్లలో నానబెట్టి శుభ్రం చేశారు. ఆరిన తర్వాత ఇస్త్రీ చేసి తిరిగి పూర్వరూపానికి తీసుకువచ్చారు. ఈసారి నాణాలు పెద్దమొత్తంలో వచ్చాయి. అయిదు పెద్ద నీళ్ల ప్లాస్టిక్ డమ్ములు నిండాయి. వీటిని డినామినేషన్ల ప్రకారం వేరు చేశారు. వాటిని బ్యాంకు అధికారుల సమక్షంలో తూకం వేసి లెక్కకట్టారు. నోట్లతో పాటు నాణాలను బ్యాంకులో జమ చేశారు. అన్నిటి లెక్కింపు పూర్తయినందువల్ల బుధవారంతో ఏడురోజుల పాటు సాగిన కౌంటింగ్‌కు తెరపడిందని సమ్మక్క సారలమ్మ జాతరు ఈవో రాజేంద్రం తెలిపారు.

ఫిబ్రవరి 29నుంచి హుండీలలెక్కింపు ప్రారంభమైంది. లెక్కింపులో మొత్తం 350 మంది దేవాదాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. లెక్కింపులో పాల్గొన్నవారు డ్రెస్‌కోడ్ పాటించారు. లెక్కింపు సందర్భంగా ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం చుట్టూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కించిన నగదును ఎప్పటికప్పుడు బ్యాంకులో జమచేశారు. నగదును, బంగారం, వెండి బంగారం కానుకలను చివర మదింపువేసి బ్యాంకులాకర్‌లో భద్రపరిచారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖల సహకారంతో సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీల లెక్కింపు ఏడు రోజుల పాటు ప్రశాంతవాతారణంలో నిర్వహించారు. ఈ సారి హుండీల్లోని నాణాలు, బంగారం, వెండి వస్తువులను జల్లెడ పట్టడానికి ప్రత్యేకంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల హుండీల లెక్కింపు వేగవంతగా జరిగింది. గతంలో హుండీల లెక్కింపు పూర్తయ్యేసరికి పది, పదకొండు రోజుల పట్టేది. ఈ సారి ఆరు రోజుల్లో పూర్తి చేశారు. బుధవారంతో మొత్తం 540 హుండీలను లెక్కించారు. నగదుతో పాటు హుండీల్లో భక్తులు వేసిన బంగరు, వెండి కానుకలను కూడా తూకం వేసి వాటి విలువను మదింపు వేశారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశవ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అధఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప.. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాటు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

'గ్యారెంటీ'లను అమలు చేస్తాం

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క



ములుగులో లబ్ధిదారుకు జీరో కరెంటు బిల్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 6: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీ పథకాన్నింటినీ తప్పకుండా అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క భరోసా ఇచ్చారు. ములుగు జిల్లాకేంద్రంలోని సఫాయికాలనీలో గృహజ్యోతి కార్యక్రమం కింద జీరో కరెంటు బిల్లులను లబ్ధిదారులకు బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు గ్యారెంటీ పథకాల అమలును శ్రీకారం చుట్టిందన్నారు. 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాల అమలును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా వేలాదిమందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. గత ప్రభుత్వాలు అవలంబించిన ఆర్థిక విధానం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని, దానిని సరిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు మల్సూర్, నాగేశ్వర్‌రావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్ పర్సన్‌కు అవిశ్వాస గండం!



భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయం

భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయింది మొదలు.. ఆ పార్టీ కోటలకు బీటలు వారడం మొదలైంది. గత మునిసిపల్ ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యంతో చైర్ పర్సన్ పీఠాన్ని చేజిక్కించుకున్న గులాబీ పార్టీకి ప్రస్తుతం అవిశ్వాస గండం పొంచి ఉందని తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ శిబిరంలో ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నెల రోజులుగా భూపాలపల్లిలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించేందుకు సిద్ధమైనట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. ముగ్గురు కౌన్సిలర్లు ఆ పార్టీ నేతలకు అందుబాటులోకి రాకుండా పోవడం ఊహాగానాలకు మరింత బలం చేకూర్చుతోంది. మునిసిపల్ చైర్ పర్సన్ సహా మరో ఇద్దరు కౌన్సిలర్లు భూ ఆక్రమణ కేసులో చిక్కోవడం సాక్షాత్తు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్రజ్యోతి, ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై కూడా కేసులు నమోదు కావడంతో కాంగ్రెస్ చైర్ పర్సన్ పీఠాన్ని హస్తగతం చేసుకునే దిశగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తాజాగా గురువారం మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో గురువారం నాటి కౌన్సిల్ సమావేశం, వైస్ చైర్మన్ ఎన్నికకు కోరం ఉంటుందా.. లేదా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మునిసిపల్ వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న కౌన్సిలర్ కూడా కేసులో నిందితుడిగా ఉండటంతో చట్టపరంగా ఎన్నిక సాధ్యమా? అన్న కోణంలోనూ అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నేతలు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మునిసిపల్ చైర్ పర్సన్‌పై కూడా అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు కాంగ్రెస్ నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పార్టీల వారీగా బలాలివే..

భూపాలపల్లి మునిసిపాలిటీలో ప్రస్తుతం బీఆర్ఎస్‌దే పైచేయిగా ఉంది. మునిసిపాలిటీలో మొత్తంగా 30 వార్డులు ఉన్నాయి. వీటిల్లో బీఆర్ఎస్ తరఫున 16 మంది, కాంగ్రెస్ తరఫున 13 మంది సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, మరోవైపు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎక్స్ అఫిషియో మెంబర్లుగా ఓట్లు కలిగి ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు 18 మంది, కాంగ్రెస్‌కు 14 మంది సభ్యుల కోరం ఉండనుంది. ఈ తరుణంలో బీఆర్ఎస్‌లోని ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్‌కు 17 మంది సభ్యుల మద్దతు ఉండగా బీఆర్ఎస్‌కు 15 మంది మాత్రమే సభ్యులు ఉండనున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ మునిసిపాలిటీని హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఏటూరునాగారంలో మాట్లాడుతున్న మైనారిటీ వెల్ఫేర్ అధికారి ప్రేమలత

ఏటూరునాగారం, మార్చి 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల సెమినార్ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. చిన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మైనారిటీ వెల్ఫేర్ జిల్లా అధికారి ప్రేమలత, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మహిళా సాధికారికత సాధ్యమవుతుందని అన్నారు. లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రినిపాల్ చిన్న, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ ఎం. విజయలక్ష్మి, ఐకేసీ కోఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రవీందర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్. ఉమారాణి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ యు. స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం. ఘనసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప): అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా మండలంలోని అడవిరంగాపూర్, పాలంపేటలలో బుధవారం జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సీడీపీవో స్వాతి హాజరయ్యారు. మహిళలు వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్వాతంత్ర్యం సాధించినట్లయితే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వయోజన మహిళలను సన్మానించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ చందన, సూపర్‌వైజర్ అరుణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సుమతి, ఆర్థిక నిపుణురాలు శిరీష, కౌన్సిలర్ సంధ్య, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్ : దేశంలోని మహిళల సాధికారత కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాటుపడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ములుగులోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు గాధం కుమార్ అధ్యక్షతన శక్తివంతం అభియాన్ కార్యక్రమం నిర్వహించగా బలరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొమ్మిదేళ్ల సుపరిపాలనలో మహిళా సంఘాలకు ఎన్నో వడ్డీలేని రుణాలు అందించి మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడ్డారని అన్నారు. మహిళలు ఒక శక్తిగా ఎదిగేందుకు పథకాలను ప్రారంభించారని, మోదీ పాలనలో మహిళలకు ఉజ్వల గ్యాస్, జన్‌ధన్ ఖాతా, మహిళా సంఘాల వడ్డీలేని రుణాలు, ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలు, ముద్ర యోజన ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోత్తంరెడ్డి, చందా జ్యోతి, గుగులోత్ స్వరూప, నగరపు రమేష్, భూక్య జవహర్‌లాల్, శీలమంతుల రవింద్రచారి, జినుకుల కృష్ణాకర్, చల్లూరి మహేందర్, రవిరెడ్డి, మద్దినేని తేజరాజు, వెంకట్, హేమాద్రి, రాజశేఖర్, మల్లేష్‌తోపాటు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

● తాడ్వాయి: అన్నిరంగాల్లో రాణించాలంటే మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.విజయ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సృష్టిలో గొప్ప శక్తి స్త్రీ శక్తి అని, అటువంటి మహిళలు విద్య, వైద్యం, యుద్ధ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఉన్నతి సాధించాలని అన్నారు. ప్రాథమికంగా మహిళల సాధికారతకు భంగం కలిగించేవే బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు అని, వాటి నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో సోషల్ వర్కర్ బండారి జ్యోతి, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రజిని, సఖి కేంద్రం కౌన్సిలర్ కల్పన, అంగన్‌వాడీ టీచర్లు, వీవో లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు: మండలంలోని ఏడ్జర్లపల్లి సెక్టార్ పరిధిలోని మురుమూరు అంగన్‌వాడీ కేంద్రం-3లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు 108,102,181 వంటి సేవలను ఉపయోగించుకోవాలన్నార అంగన్‌వాడీ టీచర్ పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక దినోత్సవాన్ని నిర్వహించాలి

ఏటూరునాగారం మండంలో మావోయిస్టుల పోస్టర్లు

ఏటూరునాగారం, మార్చి 6 : అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని నిర్వహించాలని, మహిళలపై జరుగుతున్న రాజ్య హింసలు, హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న సభలు, సమావేశాలు జరుపుకోవాలని మావోయిస్టులు పేర్కొన్నారు. ఈ మేరకు మండ కేంద్రంలో పోస్లర్లు ప్రదర్శించారు. ఈనెల 8న అంతర్జాతీయ పోరాట మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని పార్టీ అనుబంధ అదివాసీ విప్లవ మహిళా సంఘం, విప్లవ మహిళా సంఘం ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చాయి. పెట్టుబడిదారీ విధానాలను, పితృస్వామిక భావజాలాన్ని పెంచి పోషిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరాయి. రాష్ట్ర వ్యాప్తంగా 8న సభలు, సమావేశాలు, 114వ వార్షికోత్సవాన్ని జరుపుకోవాలని పేర్కొన్నాయి.

మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



దేవాలయం ఆవరణలో ఎస్పీ శబరీశ్

వెంకటాపూర్(రామప్ప), మార్చి 6: మండ లంలోని రామప్ప దేవాలయంలో ఈనెల 8నుంచి జరుగనున్న మహాశివరాత్రి ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శబరీశ్ బుధవారం పరిశీలించారు. రామలిం గేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవే క్షిస్తూ బందోబస్తు నిర్వహించాలని, సరస్సు వద్దకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ మేకల రంజిత్‌కుమార్, స్థానిక ఎస్సై చల్ల రాజు, సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

చిట్యాల, మార్చి 6: దారి తప్పి అటవీ ప్రాంతంలో చిక్కుకున్న వృద్ధుడి అచూకీని చిట్యాల పోలీసులు తెలుసుకున్నారు. అనంతరం బంధువులకు అప్పగించారు. భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందినబుర్ర కరుణాకర్ శివసత్తులు ధరించే గజ్జల దుస్తులను విక్రయించుకుంటూ జీవనం సాగించేవాడు. వారం రోజుల క్రితం వెంచరామి గ్రామం నంచి అటవీ ప్రాంతం ద్వారా తాడిచెర్లకు బయల్దేరగా అతడు దారి తప్పాడు. ఫోన్ ద్వారా అతడు ఈ విషయాన్ని తన కుమారుడికి సహచారం ఇచ్చాడు. దీంతో అతడు 100 నంబరుకు ఫోన్ చేసి చిట్యాల పోలీసులకు ఈ విషయాన్ని తెలిపాడు. దీంతో కానిస్టేబల్స్ నవీన్, లింగయ్య గాలింపు చర్యలు చేపట్టారు. వెంచరామి గ్రామానికి చెందిన రాజు సహాయంతో అటవీ ప్రాంతంలో వెతికి బుధవారం ఆచూకీ కనుగ్గొన్నారు. అనంతరం కరుణాకర్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని..

మంగపేట : మతిస్థిమితం లేని వ్యక్తిని మంగపేట పోలీసులు అతడి కుటుంబానికి అప్పగించారు. స్థానిక పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై గోదారి రవికుమార్ మాట్లాడుతూ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లూరు ఏరియాలో అపరిచిత వ్యక్తి సంచారిస్తున్నాడని, చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే వాడేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొట్టగా అతడిని పోలీసులు అతడిని పట్టుకొని విచారించారు. తాడ్వాయి మండలంలోని బయక్కపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడికి మతిస్థిమితం లేదని, 15 రోజుల క్రితం ఇంట్లోంచి బయటకు వచ్చి గ్రామాల్లో సంచరిస్తూ మంగపేట మండలానికి చేరుకున్నాడని తేలింది. అనంతరం ఆ వ్యక్తిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.

రోడ్డు నిర్మాణం వెంటనే చేయాలి

● లిబరేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్

టేకుమట్ల, మార్చి 6: మండలంలోని సుబ్బక్కపల్లి-టే కుమట్ల గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సీపీఐ (ఎంఎల్)-లి బరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉందని అన్నారు. దీంతో ద్విచక్ర వాహనదా రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు బస్సు పంపించడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. దీంతో అంకుషాపూర్, సోమన్‌పల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కొరవడిందన్నారు. అయినా స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

హైడ్రామా!

(3వ పేజీ తరువాయి)

దంపతులకు ప్రధాన అనుచరుడిగా హరిబాబు కొనసాగుతున్నారు. ఈక్రమంలోనే ఆయన్ను అరెస్టు చేయడానికి పోలీసులు యత్నించడంతో ఆయన తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు.

దురుద్దేశం లేదంటున్న పోలీసులు

రెండు నెలల కిందట హరిబాబు మునిసిపల్ వైస్ చైర్మన్ పదవికి హరిబాబు రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో గురువారం వైస్ చైర్మన్ ఎన్నిక కోసం కౌన్సిల్ సమావేశం జరగనుంది. అయితే.. కోరం లేకుండా చేయడం కోసమే తనపై తప్పుడు కేసులు బనాయించి అధికార పార్టీ నేతలు అరెస్టు చేయించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ హరిబాబు విమర్శిస్తున్నారు. పోలీసుల వాదన మరోలా ఉంది. భూ అక్రమణ కేసుకు సంబంధించి రాజలింగమూర్తి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామంటున్నారు. దీంతో హరిబాబును అరెస్టు చేయాల్సి ఉండగా ఇన్నాళ్లు ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆ పని చేయలేకపోయామంటున్నారు. ఆయన ఇంట్లో ఉన్న సమాచారాన్ని తెలుసుకొని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లామే తప్ప.. ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.

తునికాకు టెండర్లు చేపట్టాలి

గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్

కాకతీయఖని, మార్చి 6: తునికాకు యూనిట్లకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలెం రాజేందర్ డిమాండ్ చేశారు. అటవీశాఖ సూపరింటెండెంట్ శశికళకు ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని, కొమ్మ కొట్టే పనిని వెంటనే పూర్తి చేయాలని చేశారు. తునికాకు బోనస్ రూ. 400 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో తునికాకు సేకరణదారులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి

టీఎస్‌యూఎస్ అధ్యక్షుడు గట్టయ్య

కాకతీయఖని, మార్చి 6: సింగరేణి విజిలెన్స్ ఆధీనంలో ఉన్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన కార్మికులు కొందరు ఎలాంటి తప్పులు లేకున్నా, మరికొందరు తెలిసి తెలియక తప్పులు చేసిన వారి ఫైళ్లను విజిలెన్స్ అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. విజిలెన్స్ కేసుల్లో బలైన కొందరు కార్మికులు మానసికంగా, శారీరకంగా ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

పొదెం వీరయ్యపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 6: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదెం వీరయ్య భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి కృషి చేయలేదని అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉండి కూడా భద్రాచలానికి ఎలాంటి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. స్వప్రయోజనాల కోసం పార్టీలు మారే వెంకట్రావ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈసమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, నాయకులు చిడెం శివ, ఎంపీటీసీ గార్లపాటి రవి, చిడెం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు: మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ భద్రాచలం చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాట్ల సీతారామరాజు(వాసు) డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా వీరయ్య ఎన్నోసార్లు భద్రాచలం నియోజకవర్గ సమస్యల గురించి, అభివృద్ధి గురించి మాట్లాడారని అన్నారు. అధికారదాహం కోసం పాకులాడుతున్న బీఆర్ఎస్ నేతలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మారి రోజుకో జెండా కప్పుకొని తిరిగే వారిని ప్రజలు ఎప్పుడూ నమ్మరని పేర్కొన్నారు. ఈసమావేశంలో నాయకులు తంతులూరి విశ్వనాథప్రసాద్‌రాజు, కాకర్లపూడి విక్రాంత్, తల్లడి ఆదినారాయణ, పూనెం రాంబాబు, షేక్ ఖాజావలీ, సాబీర్‌పాషా, మురారి, సంజీవరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

వాజేడు, మార్చి 6: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనాన్ని గడపాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్, స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావులు అన్నారు. ఈమేరకు వారు సిబ్బందితో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పోస్టర్లను ఏర్పాటు చేశారు. మావోయిస్టులు లొంగియి కుటుంబంతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు.

● కన్నాయిగూడెం: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబంతో ప్రశాంతంగా బతకాలని ఎస్సై ఎం.సురేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు పోస్టర్లను అతికించారు.

సీసీఎస్ సీఐగా రవీందర్



గణపురం, మార్చి 6: జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీసీఎస్ సీఐగా గద్ద రవీందర్ బాధ్యతలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీసీఎస్ సీఐగా విధులు నిర్వహించిన పులి వెంకట్ ఇటీవల హుజురాబాద్ రూరల్‌కు బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో విధులు నిర్వహిస్తున్న రవీందర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

చిట్యాల సీఐగా మల్లేష్

చిట్యాల : చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.మల్లేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన వేణుచందర్ బదిలీ కాగా హనుమకొండ జిల్లా శాయంపేట సీఐగా పనిచేసిన మల్లేష్ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సర్కిల్ ఎస్సైలు రమేష్, సాంబమూర్తి, మాధవ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక కార్యకర్తకు పోలీసుల సన్మానం

గోవిందరావుపేట, మార్చి 6: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో భక్తులకు సేవలందించిన సామాజిక కార్యకర్త రామకృష్ణను బుధవారం మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై షేక్‌మస్తాన్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి, భక్తులకు రామకృష్ణ ఐదురోజులపాటు సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

చిట్యాల, మార్చి 6: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ దావు వినోద బుధవారం ఏర్పాటు చేశారు. గృహ జ్యోతి, గృహలక్ష్మి పథకంలో లబ్ధి పొందని అర్హులైన వారు సేవాకేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ప్రజా పాలన దరఖాస్తు చేయనివారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రామకృష్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడిగా రాజు



చిట్యాల, మార్చి 6: యూత్ కాంగ్రెస్ చిట్యాల టౌన్ అధ్యక్షుడిగా అల్లం రాజును బుధవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, శ్రీకాంత్, రామకృష్ణ, కోశాధికారిగా రమణలను ఎన్నికయ్యారు. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యనారాయణ, రవి, మల్లేష్, రాంచందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు విడుదల చేయాలి

మంగపేట, మార్చి 6: గిరిజనులకు అందాల్సిన ట్రైకార్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని ఆదివాసీ సేన జిల్లా కార్యదర్శి పోలేబోయిన ఆదినారాయణ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ మేరకు లబ్ధిదారులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు చెందిన 174 మంది గిరిజనులు 2020-21 ఆర్థిక సంవత్సరంలో ట్రైకార్ రుణాలకు ఎంపికయ్యారని, ఇప్పటి వరకు వారికి ఎలాంటి లబ్ధిచేకూరలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాబురావు, కృష్ణవేణి, సత్యనారాయణ, రాంబాబు, రవళి, వెంకటయ్య, రమేష్, సావిత్రి, నిర్మల, భూషణం తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 114 మంది హాజరు

చిట్యాల, మార్చి 6: స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి విశేష స్పందన లభించింది. చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన 120 దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేసుకోగా 114 మంది హాజరయ్యారని డీపీఎం నారాయణ తెలిపారు. శారీరక, మానసిక వైకల్యం కలిగి ఉన్న వారిని వైద్యులు పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మంజూల, శ్రీనివాస్, వైద్యులు రాజేష్, రాజ్‌కుమార్, సుకన్య దివిజ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

వాజేడు, మార్చి 6: మండలంలోని పేరూరు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం వరకు ప్రతి రైతువేదికలో ఇటువంటి యూనిట్లను ప్రారంభించి వ్యవసాయంలో ఆధునిక, సాంకేతిక విధానాలను వ్యవసాయ యూనివర్సిటీ అనుసంధానంతో రైతునేస్తం కార్యక్రమం ద్వారా ప్రతిరైతుకు అందేలా చూస్తామని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. రైతు బీమాతోపాటు పంటల బీమాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీధర్, నాయబ్ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, డివిజన్ వ్యవసాయ విస్తరణాధికారులు, పేరూరు ఎస్సై రమేష్, రైతులు పాల్గొన్నారు.